9.15కు రాకుంటే సగం రోజు సెలవు తీసుకున్నట్టే! కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు డీపీవోటీ సర్క్యులర్

న్యూఢిల్లీ: సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠినంగా వ్యవహరించాలని కేంద్రం నిర్ణయించింది. ఉద్యోగులు ఇష్టానుసారం కార్యాలయాలకు వస్తుండడం, సమయానికి ముందే వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన కేంద్ర ప్రభుత్వ వ్యక్తిగత, శిక్షణ శాఖ (డీవోపీటీ) దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు సర్క్యులర్ జారీ చేసింది. ఇకపై ఉద్యోగులందరూ ఉదయం 9.15 గంటలకే బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సిందేనని, ఆలస్యంగా వచ్చే వారు సగం రోజు సాధారణ సెలవు నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఎవరైనా ఉద్యోగి ఏదైనా రోజున విధులకు హాజరుకాలేని పక్షంలో ఆ విషయాన్ని ముందుగానే తెలియజేయడంతో పాటు క్యాజువల్ లీవ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

- ఉగ్ర దాడుల నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు

జమ్ము: హిమాలయాల్లో ఎత్తయిన గుహలో సహజసిద్ధంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించేందుకు అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. శనివారం అమర్‌నాథ్ గుహలో ఉదయం ప్రథమ పూజను నిర్వహించారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పూజలో పాల్గొన్నారు. ఈ నెల 29 నుంచి మంచు శివలింగాన్ని దర్శించుకునేందుకు అవకాశం ఉంది. ఈ యాత్ర ఆగస్టు 19 వరకు కొనసాగుతుంది. ఇటీవల జమ్ము-కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రవాద ఘటనలను పురస్కరించుకుని పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

జోధ్‌పూర్‌లో ఘర్షణలు

జోధ్‌పూర్, జూన్ 22: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో రెండు వర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకొంది. ఇందులో ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. సూర్‌సాగర్ ఏరియాలోని ఓ ప్రార్థనా మందిరం వెనుక వైపు గేట్ నిర్మాణం విషయంలో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. గేటు నిర్మాణం వలన ఆ ఏరియాలో ప్రజల రాకపోకలు పెరుగుతాయని చెబుతూ గేట్ నిర్మాణాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం గేట్ నిర్మాణాన్ని కొంత మంది ప్రారంభించారని, ఆ తర్వాత రెండు వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసిందని పోలీసులు తెలిపారు.

ఆ నకిలీ డ్రగ్స్ పట్ల జాగ్రత్త: డబ్ల్యూహెచ్‌వో

జెనీవా: టైప్-2 డయాబెటిస్ చికిత్సలో వినియోగించే డ్రగ్ 'ఒజెమ్పిక్' మౌంజారో, ఇతర జీఎల్‌పీ-1 ఔషధాల నకిలీ వెర్షన్ల విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తాజాగా హెచ్చరికలు చేసింది. బరువు తగ్గించుకొనే మార్గంగా ఎక్కువగా ఉపయోగిస్తున్న ఈ ఔషధాల నకిలీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఫేక్ వెర్షన్లు మార్కెట్లకు పోటెత్తుతున్నాయని పేర్కొన్నది. నకిలీ మందు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని హెచ్చరించింది. గత ఏడాది అక్టోబర్‌లో బ్రెజిల్, ఐర్లాండ్‌లలో, డిసెంబర్‌లో అమెరికాలో ఈ తప్పుడు ఉత్పత్తుల మూడు బ్యాచ్‌లను గుర్తించినట్టు పేర్కొన్నది. ఆన్‌లైన్ లేదా సోషల్ మీడియాలో కాకుండా విశ్వసనీయమైన వైద్యుల మార్గం ద్వారానే ఔషధాన్ని కొనుగోలు చేయాలని సూచించింది.

అమెరికాలో మళ్లీ కాల్పులు

ముగ్గురు మృతి

ఫోర్ట్జ్: అమెరికాలో దారుణం చోటు చేసుకుంది. ఆర్కాన్సస్ రాష్ట్రంలోని ఫోర్ట్జ్‌లో 'మాడ్ బచర్' మాంసం దుకాణం బయట శుక్రవారం ఒక ఉన్మాది విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించగా, మరో 10 మంది, ఇద్దరు భద్రతా సిబ్బందికి కూడా గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. నిందితుడిని ట్రావిస్ యూజీన్ పోసే (44)ను పోలీసులు అరెస్టు చేశారు.

పరీక్షల వ్యవస్థపై నిపుణుల కమిటీ

- నీట్, నెట్ లీకేజీల నేపథ్యంలో కేంద్రం నియామకం
- అక్రమాల అడ్డుకట్టకు సూచనలు ఇవ్వనున్న కమిటీ
- నీట్ పేపర్ లీకేజీలో కీలక పాత్రధారి రవి అత్రి అరెస్టు
- నీట్ పేపర్ లీక్ వీరుడు సంజీవ్ అక్రమాలు వెలుగులోకి

న్యూఢిల్లీ, జూన్ 22: నీట్-యూజీ, యూజీసీ-నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలతో పరీక్షల వ్యవస్థపై అనుమానాలు పెరుగుతున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలకు దిగింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యల కోసం ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కమిటీకి ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కే రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నారు. ఇందులో సభ్యులుగా ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ రామమూర్తి, పీపుల్ స్ట్రాంగ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు, కర్మయోగి భారత్ సంస్థ బోర్డు సభ్యుడు పంకజ్ బన్సల్, ఐఐటీ ఢిల్లీ విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్‌ను కేంద్ర విద్యా శాఖ నియమించింది. విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైస్వాల్ ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా కొనసాగుతారు. ఈ కమిటీ ప్రస్తుతం ఉన్న పరీక్షల ప్రక్రియను పూర్తిగా అధ్యయనం చేసి, పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రానికి రెండు నెలల్లో ఒక నివేదిక సమర్పించనుంది. ఎన్‌టీఏ పనితీరు మెరుగుపరిచేందుకు సైతం సూచనలు చేయనుంది. కాగా, నిపుణుల కమిటీ ఏర్పాటును యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ స్వాగతించారు. ఈ కమిటీ సిఫార్సు చేసే సంస్కరణల ద్వారా జాతీయ ప్రవేశ పరీక్షల వ్యవస్థ పటిష్ఠం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు 1563 మందికి మళ్లీ నీట్ పరీక్ష

నీట్‌లో గ్రేస్ మార్కులు తొలగించిన 1563 మంది విద్యార్థులకు ఆదివారం మరోసారి పరీక్షను నిర్వహించనున్నారు. మొదటిసారి పరీక్షలో వీరికి పూర్తిగా పరీక్షా సమయం ఇవ్వనందుకుగానూ గ్రేస్ మార్కులు కలుపుతూ ఎన్‌టీఏ నిర్ణయం తీసుకుంది. ఇది వివాదం కావడంతో గ్రేస్ మార్కులు తొలగించి మళ్లీ పరీక్ష నిర్వహిస్తున్నది.

నీట్ పేపర్ లీక్ వీరుడు సంజీవ్ ముఖియా

ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్-యూజీ 24 పరీక్ష పేపర్ లీకేజీలో ప్రధాన నిందితుడిగా సంజీవ్ ముఖియా పేరు బయటకు రావడంతో అతనెవరు అన్న ఆసక్తి అందరిలో ఏర్పడింది. బీహార్‌లోని నలందా కాలేజీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంజీవ్ ముఖియా అంతకుముందు జరిగిన బీహార్ టీచర్స్ రిక్రూట్‌మెంట్ పరీక్ష పేపర్ లీకేజీ కేసులో కూడా నిందితుడు. తొలుత సాబౌర్ అగ్రికల్చర్ కాలేజీలో పనిచేసిన సంజయ్‌ను ఉత్తరాఖండ్ పోలీసులు 2016లో ఒక పేపర్ లీక్ కేసులో అరెస్ట్ చేయడంతో అతడిని నూర్‌సరైకి బదిలీ చేశారు. సంజీవ్ కుమారుడు డాక్టర్ శివకుమార్ బీహార్ పరీక్ష పేపర్ లీక్ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్నాడు. పరీక్ష పేపర్ల లీకేజీలో కరుడుగట్టిన ముఖియా సాల్వర్ గ్యాంగ్ స్థాపనలో వీరిద్దరూ భాగస్వాములేనని బీహార్ పోలీసులు తెలిపారు. నీట్ పేపర్ లీక్‌లో ఆయన పేరు బయటకు రావడంతో మే 6 నుంచి సంజీవ్ పరారీలో ఉన్నాడు. అయితే అతను ఒక లాయర్ ద్వారా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ఒక కీలక వ్యక్తి ద్వారా నీట్ పేపర్‌ను అందుకున్న సంజీవ్ దానిని పలువురు విద్యార్థులకు లక్షలాది రూపాయలకు అమ్మాడు. వారందరినీ పరీక్షకు దగ్గరుండి ప్రిపేర్ చేయించాడు. ఈ విషయాన్ని అరెస్టయిన విద్యార్థులు ఇప్పటికే పోలీసులకు వెల్లడించారు. ఒక్కో విద్యార్థి నుంచి 30 నుంచి 50 లక్షలు వసూలు చేశారు. విద్యార్థులను పాట్నాలోని చిన్నచిన్న లాడ్జీలలో ఉంచి వారి చేత జవాబులు బట్టీ పట్టించాడు.

వారణాసిలో నిరసనకారుల్ని అడ్డుకుంటున్న పోలీసులు

భార్య రాజకీయ నేత.. కొడుకు డాక్టర్

వాస్తవానికి సంజయ్ పేరు ముఖియా కాదు. అతని అసలు పేరు సంజీవ్ సింగ్. అయితే అతని భార్య మమతా దేవి ముఖియా పంచాయతీ చీఫ్‌గా ఎన్నిక కావడంతో సంజీవ్ సింగ్‌ను అందరూ ముఖియాగా పిలవడం ప్రారంభించారు. అయితే 2020 బీహార్ ఎన్నికల్లో హర్నోత్ నుంచి లోక్‌జన్ శక్తి పార్టీ నుంచి పోటీ చేసిన ఆమె ఓడిపోయారు. కాగా, సంజీవ్ సింగ్ తొలుత నీట్ పేపర్‌ను రాఖీ అనే వ్యక్తికి అప్పగించాడని పోలీస్ వర్గాలు తెలిపాయి. పలు పోటీ పరీక్షల పేపర్ల లీకేజీ కేసుల్లో సంజయ్ అనుమానితుడు. ఆ కేసుల్లో అతను జైలుకు కూడా వెళ్లాడు. వృత్తిరీత్యా డాక్టరైన అతని కుమారుడు శివకుమార్ కూడా పేపర్ లీకేజీలో ఆరితేరిన వాడు. బీహార్ టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష పేపర్ లీకేజీ కేసులో అతను ప్రస్తుతం జైలులో ఉన్నాడు.

మే 5నే ఫోన్ కాల్ ద్వారా సమాచారం

నీట్ జరిగిన మే 5న లీకేజీ గురించి ఒక ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందినట్టు బీహార్ పోలీస్ అధికారులు తెలిపారు. జార్ఖండ్ కేంద్రంగా ఉన్న సెంట్రల్ ఏజెన్సీ నుంచి వచ్చిన ఆ కాల్‌లో నీట్ పేపర్ లీకేజీలో ఏ గ్యాంగ్ పాల్గొన్నది, వారు వాడిన కారు, ఇతర వివరాలన్నీ అందజేసి, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారన్నారు. దాంతో తాము వెంటనే ఆ కారును స్వాధీనం చేసుకున్నామని, ముఠాకు చెందిన పులువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్‌పై వేటు

ఐటీపీఓ ఎండీకి అదనపు బాధ్యతలు

నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వివాదాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు చర్యలకు పూనుకుంది. జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌ని ఈ పదవి నుంచి తొలగించింది. ఆయనను పర్సనల్, ట్రైనింగ్ విభాగంలో వెయిటింగ్‌లో ఉంచింది. ప్రస్తుతం ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్(ఐటీపీఓ) చైర్మన్, ఎండీగా ఉన్న ప్రదీప్ సింగ్ ఖరోలాకు ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. కొత్త డీజీ నియామకం వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

పేపర్ లీక్ కేసులో ఏడుగురు అరెస్టు

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో మరికొందరు అరెస్టయ్యారు. ఈ వ్యవహారంలో కీలక నిందితుడిగా భావిస్తున్న రవి అత్రిని యూపీ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసింది. బీహార్‌లో నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి పలువురు నిందితులు, విద్యార్థులు అరెస్టు అయినప్పటికీ వీరికి పేపర్ ఎక్కడి నుంచి లీక్ అయ్యిందనే విషయం మాత్రం తేలలేదు. అయితే, వీరిని విచారిస్తున్న సందర్భంగా రవి అత్రితో ఉన్న సంబంధాలు వెలుగులోకి వచ్చాయని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే రవిని అరెస్టు చేశారు. గ్రేటర్ నోయిడా సమీపంలోని నీంక అనే గ్రామానికి చెందిన రవి అత్రి గతంలోనూ వివిధ రాష్ట్రాల్లో పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలను లీక్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2012లోనూ మెడికల్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశాడనే ఆరోపణలతో ఢిల్లీ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. బీహార్‌లో నీట్ పేపర్ లీకేజీ కేసులో మరో ఆరుగురు నిందితులను జార్ఖండ్‌లోలో పోలీసులు అరెస్టు చేశారు.

నీట్-పీజీ పరీక్ష వాయిదా

- త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తాం
- కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన
- పరీక్షకు ముందు రోజు నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 22: నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల వివాదం నేపథ్యంలో నీట్-పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. ఆదివారం పరీక్ష జరగాల్సి ఉండగా శనివారం రాత్రి ఈ మేరకు ప్రకటన చేసింది. పలు పోటీ పరీక్షల సమగ్రతపై ఇటీవలి ఆరోపణల నేపథ్యంలో నీట్-పీజీ పరీక్ష ప్రక్రియ పటిష్ఠతను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొన్నది. కొత్త తేదీని వీలైనంత త్వరగా ప్రకటిస్తామని వెల్లడించింది. విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొన్నది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, పరీక్ష ప్రక్రియ పవిత్రతను కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కాగా, నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ అయ్యిందని, అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతుండగానే నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్షను రద్దు చేశారు.

పరీక్ష వాయిదాను ఖండించిన బీఆర్ఎస్

నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయడాన్ని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోల్ల శ్రీనివాస్ ఖండించారు. రాత్రికి రాత్రి పరీక్షను వాయిదా వేయడం కేంద్రం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలను పరీక్ష వాయిదాతో కప్పి పుచ్చుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. నీట్ పీజీ, యూజీ, నెట్ పరీక్షల వరుస వాయిదాలతో కేంద్రం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నదని విమర్శించారు.

పప్పు ధాన్యాల నిల్వలపై ఆంక్షలు

ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ: నిత్యావసరాల ధరల నియంత్రణకు ఎట్టకేలకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. పప్పు ధాన్యాల నిల్వలపై ఆంక్షలు విధించింది. తాజా నిబంధనల ప్రకారం టోకు వ్యాపారులు 200 టన్నులు, రిటైలర్లు 5 టన్నులు, ఇక బిగ్ చైన్ రిటైలర్లు ఒక్కో ఔట్‌లెట్‌లో 5 టన్నులు, డిపోలో 200 టన్నులు, మిల్లర్లైతే మొత్తం వార్షిక సామర్థ్యంలో 25 శాతం లేదా గత మూడు నెలల ఉత్పత్తి మొత్తం ఏది ఎక్కువైతే దానిని ఉంచుకోవచ్చు. ఇక దిగుమతిదారులైతే దిగుమతి చేసుకున్న సరుకును కస్టమ్స్ క్లియరెన్స్ జరిగిన తర్వాత 45 రోజులకు మించి ఉంచరాదు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు వీటిని పర్యవేక్షిస్తుంది.

బఫర్ స్టాక్‌గా 71 వేల టన్నుల ఉల్లి కొనుగోలు

ఉల్లి ధరల స్థిరీకరణ కోసం ఈ ఏడాది 5 లక్షల టన్నులను బఫర్ స్టాక్‌గా ఉంచాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా 71 వేల టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. దేశంలో చాలా చోట్ల రుతు పవనాల పురోగతి కారణంగా ఉల్లి ధరలు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం దేశంలో శుక్రవారం ఉల్లిగడ్డ కిలో ధర 38.67 ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉల్లి పంట దిగుబడి రబీ సీజన్‌లో 20 శాతం తగ్గవచ్చునని అంచనా వేస్తున్నారు. గత ఏడాది 302.08 లక్షల టన్నులతో పోలిస్తే ఈ ఏడాది 254.73 లక్షల టన్నులు మాత్రమే ఉల్లిగడ్డ పండుతుందని కేంద్రం అంచనా వేసింది. దీంతో ధరలు పెరగకుండా పెద్దయెత్తున ఉల్లిగడ్డల బఫర్‌స్టాక్‌ను ఉంచుతున్నట్టు ఒక ఉన్నతాధికారి తెలిపారు.

పేటెంట్ దరఖాస్తులో సహ యజమానిగా ఐసీఎంఆర్

హైదరాబాద్: కొవిడ్ వ్యాక్సిన్ కొవ్యాక్సిన్ పేటెంట్ దరఖాస్తులో హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ సంస్థ భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్)ను సహ యజమానిగా(కో ఓనర్)గా చేర్చింది. ఈ మేరకు సంబంధిత ప్రక్రియను ప్రారంభించినట్టు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్(బీబీఐఎల్) శనివారం వెల్లడించింది. పేటెంట్ ఫైలింగ్ విషయంలో ఐసీఎంఆర్‌ను చేర్చకపోవడం అనుకోకుండా జరిగిన పొరపాటు అని కంపెనీ పేర్కొన్నది. భారత్‌తో సహా అమెరికా, యూరప్ దేశాల్లో పేటెంట్ ఆఫీసుల్లో చేసిన దరఖాస్తులను ఐసీఎంఆర్, ఆ సంస్థ శాస్త్రవేత్తలను పేర్కొనకుండా కేవలం బీబీఐఎల్, దాని శాస్త్రవేత్తల పేర్లను పేర్కొన్నారనే నివేదికలు వచ్చాయి.

జనరల్ కోచ్‌ల సంఖ్య రెట్టింపు

- అసలే లేని రైళ్లకు ఇకపై 2 బోగీలు జత
- ఈ ఆర్థిక సంవత్సరమే అందుబాటులోకి
- రద్దీ నేపథ్యంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 22: రైల్వే ప్రయాణికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ముఖ్యంగా సామాన్యులు ఎక్కువగా ప్రయాణించే అన్‌రిజర్వ్‌డ్ బోగీలైన జనరల్ కోచ్‌ల సంఖ్యను పెంచాలని రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కంపార్టుమెంట్లను రెట్టింపు చేస్తామని, దీని వల్ల లక్షలాది మంది ప్రయాణికులకు ఉపయోగడుతుందని తెలిపింది. పలు రైళ్లలోని జనరల్ బోగీలు, స్లీపర్ క్లాస్ బోగీల్లో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రిజర్వేషన్ ఉన్నా కూర్చోడానికి కూడా వీలు లేకుండా బోగీ మొత్తం అన్‌రిజర్వ్‌డ్ ప్రయాణికులతో నిండిపోయి ఉందని రిజర్వేషన్ చేసుకున్న పలువురు ప్రయాణికులు తరచూ ఆరోపిస్తున్నారు. దీనిపై రైల్వే శాఖకు పలు ఫిర్యాదు అందడంతో స్పందించిన రైల్వే బోర్డు అధికారులు సమావేశమై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రైల్వే శాఖకు అవసరమైన కోచ్‌ల నిర్మాణంతో పాటు అదనంగా ఏడాదికి 2500 సామాన్య తరగతి కోచ్‌లను తయారు చేయించాలని నిర్ణయించింది. దీని కారణంగా దేశవ్యాప్తంగా ప్రతిఏడాది 18 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుందని రైల్వే సీపీఆర్‌వో వినీత్ అభిషేక్ వెల్లడించారు. తాజా నిర్ణయం ప్రకారం ప్రస్తుతం ఉన్న రెండు జనరల్ కోచ్‌లను రెట్టింపు చేసి నాలుగుకు పెంచుతారు. అసలు జనరల్ కోచ్‌లే లేని రైళ్లకు రెండు జనరల్ కోచ్‌లను జత చేస్తారు. ప్రతి కోచ్‌లో 150 నుంచి 200 మంది ప్రయాణించేలా వీటిని డిజైన్ చేస్తారు. దీని ప్రకారం ప్రతిరోజూ 5 లక్షల మంది వీటిలో ప్రయాణించవచ్చు. అలాగే ఈ నిర్ణయంతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికులను తీసుకువెళ్లే సంఖ్య కూడా పెరుగుతుంది.

కోచ్‌ల తయారీ సామర్థ్యం పెంపు

ప్రస్తుతం ఏటా తయారవుతున్న 1377 స్లీపర్ క్లాస్ కోచ్‌లతో పాటు 2500 జనరల్ కోచ్‌లు ఈ ఆర్థిక సంవత్సరంలోగానే సిద్ధమవుతాయని రైల్వే సీపీఆర్‌వో వినీత్ అభిషేక్ తెలిపారు. కోచ్‌ల తయారీ సామర్థ్యాన్ని ఏటేటా పెంచుతున్నామన్నారు. 2014-15లో 555 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తయారు చేయగా, 2023-24 నాటికి 7,151కు పెంచినట్టు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమృత్ భారత్, వందే భారత్ కోచ్‌లు సహా 8,692 కోచ్‌లు తయారుచేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. సౌకర్యవంతమైన ప్రయాణానికి అవసరమైన అన్ని ప్రణాళికలను రైల్వే అమలు చేస్తున్నదని తెలిపారు.

మీ ఐడీపై పరాయి వారికి టిక్కెట్లు బుక్ చేస్తే జైలుకే

అమల్లోకి కొత్త ఐఆర్‌సీటీసీ రూల్స్

న్యూఢిల్లీ, జూన్ 22: మీ స్నేహితులకో, తెలిసిన వారికో మీ వ్యక్తిగత ఐఆర్‌సీటీసీ ఐడీ మీద ఆన్‌లైన్‌లో రైల్వే టిక్కెట్లు బుక్ చేస్తున్నారా? అయితే జాగ్రత్త.. అలా చేస్తే మీకు జైలు శిక్ష, భారీ జరిమానా ఖాయం. రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం కొన్ని కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. సెక్షన్ 143 రైల్వే చట్టం ప్రకారం ఇక నుంచి కేవలం ఆధీకృత ఏజెంట్లు మాత్రమే థర్డ్ పార్టీ పేరుపై రిజర్వేషన్ టిక్కెట్లు బుక్ చేయాలి. మీ కుటుంబ సభ్యులకు, మీ ఇంటి పేరు ఉన్న వారికి, రక్త సంబంధీకులకు మాత్రమే మీ వ్యక్తిగత ఐడీ పేరున రిజర్వేషన్ టిక్కెట్లు బుక్ చేయాలి. దానిని అతిక్రమించితే రూ.10 వేల జరిమానా, మూడేండ్ల జైలు లేదా రెండు శిక్షలూ విధిస్తారు. కాబట్టి ఇక నుంచి పౌరులు తమ ఐడీని వేరేవారికి ఇవ్వవద్దని రైల్వే శాఖ విజ్ఞప్తి చేసింది. కాగా, ఐఆర్‌సీటీసీ ఐడీకి ఆధార్‌ను అనుసంధానం చేసిన వారు నెలకు 24, అనుసంధానం చేయని వారు 12 టిక్కెట్లను బుక్ చేసుకునే సౌకర్యాన్ని ఐఆర్‌సీటీసీ కల్పించింది.

గిరిజన మహిళపై గ్యాంగ్ రేప్

నిందితుడి ఇల్లు కూల్చేసిన పోలీసులు

ఇండోర్, జూన్ 22: పొట్ట కూటి కోసం ఉపాధి వెతుక్కుంటున్న ఓ గిరిజన మహిళ(20)ను మోసగించి గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఘటన బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయిన్ జిల్లా తాజ్‌పూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిందోరి గ్రామానికి చెందిన మహిళ, ఆమె భర్త ఉపాధి కోసం ఉజ్జయిన్ చేరుకున్నారు. స్థానిక ఇందిరానగర్ ప్రాంతంలో బుధవారం పని కోసం ఆరా తీస్తుండగా రవి అనే వ్యక్తి పని ఇప్పిస్తానని తాజ్‌పూర్ గ్రామ సమీపంలోని ఒక షెడ్డు వద్దకు తీసుకెళ్లాడు. మహిళను ఆ షెడ్డులో ఉంచి సరుకులు ఇప్పిస్తానని ఆమె భర్తను ఉజ్జయిన్‌కు తీసుకెళ్లాడు. వారు వెళ్లగానే ఇమ్రాన్ అనే వ్యక్తి షెడ్డు వద్దకు వచ్చి మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మహిళ భర్తను ఉజ్జయిన్‌లో వదిలి వచ్చిన రవి కూడా మహిళపై అత్యాచారం చేశాడు. వీరి నుంచి ఎలాగోలా తప్పించుకున్న మహిళ అక్కడికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ క్వారీ వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లి అక్కడి కార్మికులకు తనపై జరిగిన లైంగిక దాడి గురించి తెలిపింది. కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. శనివారం నిందితుల్లో ఒకడైన ఇమ్రాన్ ఇంటిని, ఘటన జరిగిన షెడ్డును పోలీసులు జేసీబీతో కూల్చి వేయించారు.

దళితుడైనందు వల్లే సురేశ్‌కు ప్రొటెం స్పీకర్ పదవి తిరస్కరణ

ఇండియా కూటమి ఆరోపణ

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఏడుసార్లు వరుసగా నెగ్గిన బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను ఎన్నిక చేసినట్టు బీజేపీ చేసిన ప్రకటన ఇండియా కూటమికి ఆగ్రహం తెప్పించింది. అత్యంత సీనియర్ అయిన కాంగ్రెస్ ఎంపీ సురేశ్‌కు ఆ పదవి ఇవ్వకపోవడాన్ని నిరసించింది. దళితుడైన కారణంగానే ఆయనను ఆ పదవికి దూరం పెట్టారని ఆరోపించింది. దీనిపై కూటమి పార్టీలతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ప్రొటెం స్పీకర్‌కు సహాయపడే ప్యానల్‌లో సురేశ్, డీఎంకే ఎంపీ బాలు, టీఎంసీ ఎంపీ బందోపాధ్యాయ సభ్యులుగా ఉండరని స్పష్టం చేసింది. కాగా మహతాబ్ ఎన్నికను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజ్ సమర్థించుకున్నారు.

బీహార్‌లో కూలిన మరో వంతెన

వారంలో రెండో ఘటన

పట్నా, జూన్ 22: ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న బీహార్‌లో మరో వంతెన తాజాగా కుప్పకూలింది. శనివారం ఉదయం సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. వారం వ్యవధిలో ఈ తరహా ఘటన ఇది రెండోది. దారౌందా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్..చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ క